ప్రజాశక్తి
గురువారం 22 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం

ఎంఇఒల జాబ్‌చార్ట్ విడుదల చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

మండల విద్యాశాఖకు ఎంఇఒ 1,2 పోస్టులు ప్రభుత్వం కేటాయించిందని, అయితే వీరికి జాబ్ చార్ట్ కేటాయించలేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. వీరి అధికారాలపై మీడియాలో హల్చల్ చేస్తున్నాయని, అయితే ప్రభుత్వం జిఒ రూపంలో ఇంతవరకు ఉత్తర్వులు ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికైనా స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చి గందరగోళానికి తెరదించాలని కోరారు. ఇటీవల క్రమశిక్షణ పేరుతో 137 మంది విద్యార్థుల్లోపు ఉన్న హైస్కూల్ హెచ్ఎం పోస్టులను రద్దు చేశారని, ఆయా పాఠశాలలో ప్రస్తుతం హెచ్ఎం పోస్టుల్లేక పోవడం వల్ల ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు జీతాలు చెల్లించడానికి డ్రాయింగ్ ఆఫీసర్ లేరని అన్నారు. జీతాలు చెల్లించడం, బిల్లులు పెట్టుకోవడానికి 4 రోజులు సమయం మాత్రమే ఉందని ఈలోగా జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్కడో రూలు... ఇక్కడో రూలా?

- డిడి నియామకంలో మళ్లీ కిరికిరి
- ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు
- అధికార పార్టీ కీలక నేత హస్తం
- సీనియర్‌ను పక్కనపెట్టి జూనియర్‌కు బాధ్యతలు
- ఐటిడిఎ పిఒ ఆదేశాలపై భగ్గుమన్న గిరిజన సంఘాలు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమశాఖలో ఒక్కో ఐటిడిఎకి ఒక్కో రూలు ఉంటుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ల నియామకానికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 31న గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రెండు ఐటిడిఎల్లో పని చేస్తున్న గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్లను బదిలీ చేస్తూ స్థానికంగా పని చేస్తున్న సీనియర్ ఎటిడబ్ల్యుఒలకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ డిడిలుగా నియమించాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను అమలు చేయాల్సిన ఐటిడిఎ పిఒల్లో ఒకరు ప్రభుత్వ ఆదేశాల మేరకు నియామకం చెపడితే మరొకరు ఉత్తర్వులకు భిన్నంగా వ్యవహరించారనే వాదనలు వినిపిస్తున్నాయి. సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం ఆ ఐటిడిఎ పరిధిలోని సీనియర్ ఎటిడబ్ల్యుఒ ఎం.శ్రీనివాసరావుని డిడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే బాటలో పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ కూడా ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా వ్యవహరించడం వివాదాస్పదమవుతోంది. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని సీనియర్ ఎటిడబ్ల్యుఒను డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించకుండా జూనియర్ ఎటిడబ్ల్యుఒ కె.చంద్రబాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఇంతవరకు ఇక్కడ డిడిగా పనిచేసిన బి.సూర్యనారాయణను రిలీవ్ చేయడంలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ తీవ్ర జాప్యం చేశారనే ఆరోపణలు వినిపించాయి. డిడి సూర్యనారాయణ ఇక్కడే కొనసాగడానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర ద్వారా పావులు కదిపే ప్రయత్నాలు చేశారు. అయితే మంత్రి రాజన్నదొర ససేమిరా అనడంతో ఎట్టకేలకు ఆయన రిలీవయ్యారు. తాజాగా కురుపాం ఎటిడబ్ల్యుఒ కె.చంద్రబాబును గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలతో పిఒ నియమించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా డిడి నియామకం చేపట్టడంపై గిరిజన సంఘాలు భగ్గుమంటున్నాయి. సీనియర్ గిరిజన ఎటిడబ్ల్యుఒను డిడిగా నియమించకుండా జూనియర్ ఎటిడబ్ల్యుఒను నియమించడం వెనుక అధికారపార్టీకి చెందిన కీలక నేత హస్తం వున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా గిరిజనుడినే నియమించాలని గిరిజన సంఘాలు ఆందోళన చేపట్టాయి. అప్పుడు అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న డిడిని తప్పించాలని గిరిజన, ఉపాధ్యాయ సంఘాలు పెద్దఎత్తున పోరాడాయి. ఆ పోరాటాల నేపథ్యంలో చింతూరు డిటిడబ్ల్యుఒగా ఉన్న బి.సూర్యనారాయణను ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. అప్పుడు, ఇప్పుడు కూడా గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా గిరిజన అధికారినే నియమించాలన్న డిమాండ్‌ను అధికారపార్టీ ముఖ్యనాయకులే తొక్కేయడం చర్చనీయాంశమైంది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం రాజన్నదొరగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో ఆయన ప్రమేయం లేకుండానే, ఆయన దృష్టికి రాకుండానే ఐటిడిఎ పరిధిలో కీలక నిర్ణయాలు తీసుకోవడంపై పెద్ద దుమారం నడుస్తోంది. అసలు గిరిజన సంక్షేమశాఖలో మంత్రికి తెలియకుండా కీలకమైన డిడి నియామకం జరుగుతుండడం ఇది రెండో సారి కావడం విశేషం. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎలకు సంబంధించిన డిప్యూటీ డైరెక్టర్ల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కూడా తోసిపుచ్చి తన ఆధిపత్యాన్ని మరోసారి ఆ అధికారపార్టీ నేత రుజువు చేసుకున్నారు. ఈనెల 28న కురుపాం నియోజకవర్గంలో అమ్మఒడి ప్రారంభోత్సవానికి సిఎం జగన్ మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పార్వతీపురం ఐటిడిఎలో కీలకమైన గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా గిరిజన అధికారినే నియమించాలని గత కొంతకాలంగా గిరిజన సంఘాలు చేస్తున్న డిమాండ్ అరణ్యరోదనగా మిగులుతోంది. ఈ ప్రాంతంలో త్వరలో పర్యటించనున్న సిఎం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లే ప్రయత్నంలో గిరిజన సంఘాలు ఉన్నాయి.

డిఇ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

పెంచిన విద్యుత్తు ఛార్జీలు రద్దు చేయాలి

వామపక్షాలు, ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టరాదని బుధవారం విద్యుత్‌శాఖ డిఇ కార్యాలయం వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాలు ధర్నా చేశాయి. ఈ సందర్భంగా ఈనెల 30 అన్ని మండలాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు వద్ద ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చాయి. అనంతరం ఇఇ వివి కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నానుద్దేశించి వామపక్ష నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణ బిల్లులు అమలు చేయడంతో ఈనెల విద్యుత్ బిల్లులు చూడగానే వినియోగదారులకు షాక్ కొట్టినట్టయిందన్నారు. ప్రజల కళ్లుగప్పి దొడ్డిదారిన సర్దుబాటు ఛార్జీల భారం, స్మార్ట్ మీటర్లు పెట్టి సామాన్యులను దోచి కార్పొరేట్ల జేబులు నింపుతున్నారని విమర్శించారు. దళిత, గిరిజనులకు ఇచ్చిన సబ్సిడీని కొనసాగించాలని, అనేక గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం గిరిజనులకు సబ్సిడీ బిల్లులు ఇవ్వకపోవడంతో 2019 నుంచి 2023 వరకు బకాయి బిల్లులు చెల్లించాలని వేల రూపాయలు బిల్లులు వస్తున్నాయని తెలిపారు. రావికోన పంచాయితీలో గిరిజనులకు పెద్దమొత్తంలో బిల్లులు రావడంతో కట్టలేమని వారు ఆందోళన చెందుతున్నారన్నారు. గిరిజనులు, దళితులకు సబ్సిడీ బకాయి బిల్లుల డబ్బు ప్రభుత్వమే భరించాలని నాయకులు కోరారు. సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలని, ట్రూ ఆఫ్ చార్జీల వసూళ్లు నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై భారాలు వేయొద్దని డిమాండ్ చేశారు. ఛార్జీలు పెంచే విద్యుత్ సంస్కరణ బిల్లులు రద్దు చేయాలని, విద్యుత్ కోతలు నిలిపివేయాయలని, అవసరమైన చోట ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ నాయకులు భాస్కరరావు, రైతు కూలీ సంఘం నాయకులు పి.శ్రీనునా యుడు, న్యూ డెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బి.నర్సింగరావు, ముత్యాలు, లిబరేషన్ పార్టీ నాయకులు పి.భాస్కరరావు, గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సంగాం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉపాధ్యక్షులు ఇందిర, ఐద్వా జిల్లా నాయకులు ఎం.గౌరమ్మ, గౌరి, సిపిఎం పట్టణ, మండల నాయకులు బి.సూరిబాబు, కె.రామస్వామి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.రాము పాల్గొన్నారు.

కొమరాడ : విద్యుత్ ఛార్జీలు పెంపునకు నిరసనగా ఈనెల 30న జరగనున్న ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద, గుమడ, కోటిపాం, విక్రాంపురం, అర్తంలో విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాల నాయకులు ఉపేంద్ర, రెడ్డి శివున్నాయుడు, లక్ష్మ, అక్కుల నాయుడు, వెంకట్రావు, సుబ్బారావు, ఆది బాబు, పోలి నాయుడు, మధుసూదనరావు, తిరుపతిరావు, వెంకట్రావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పాచిపెంట మండలం ఆజూరు-చాకిరావివలస రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రత్యేక దృష్టితో రోడ్ల నిర్మాణం : కలెక్టర్

ప్రజాశక్తి - పాచిపెంట/సాలూరు

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో గిరి శిఖర గ్రామాలకు రహదారుల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. సాలూరు, పాచిపెంట మండలాల పరిధిలోని మారుమూల గిరిశిఖర ప్రాంతాల్లో నిర్మిస్తున్న రహదారులను పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు బుధవారం విస్తృతంగా పర్యటించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనలో భాగంగా మండలంలోని సాలూరు మండలం జాతీయ రహదారి 26 నుండి కారాడవలస వరకు అంచనా విలువ రూ.496 లక్షల వ్యయంతో సుమారు 6.8 కిలోమీటర్లు, పాచిపెంట మండలం ఆజూరు నుండి చాకి రావివలస మీదుగా పందిరిమామిడి వలస వరకు అంచనా విలువ రూ.224 లక్షల వ్యయంతో సుమారు 3.8కిలోమీటర్లు, రొడ్డవలస నుంచి కంకనాపల్లి వరకు ఆర్‌పిపిఎల్ డబ్ల్యువి కింద నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్ నిర్మాణ పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారుల నిర్మాణాలను నిర్ణీత గడువు లోగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల నిర్మాణాలకు అవసరమైన అటవీ అనుమతులు పొంది ఉన్నందున పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల నాణ్యత ప్రమాణాల పర్యవేక్షణ పై ఆరా తీయగా ఇప్పటి వరకు రెండు దశల్లో రాష్ట్ర స్థాయిలో నాణ్యతా ప్రమాణాలు తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కల్వర్టు నిర్మాణాలకు అనుకూల సమయం అయినందున పనులను ప్రణాళికా బద్ధంగా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల ప్రజల రాకపోకలకు, రవాణా సౌకర్యాలు కలిగేలా వీలైనంత త్వరగా పూర్తి స్థాయిలో రహదారులను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పనులు పరిశీలన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాలూరు తహశీల్దార్ అర్.బాలమురళి, పంచాయితీరాజ్ శాఖ డిఇ డబ్ల్యువి శర్మ, ఎఇ లు బి.శంకరరావు, వి.వరలక్ష్మి, డిటి భానుప్రకాష్, తదితరులు, పాల్గొన్నారు.

1 నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్న సురక్ష శిబిరాలు జూలై 1నుంచి మండల స్థాయిలో నిర్వహించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య అన్నారు. జగనన్న కు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో శిబిరాలు నిర్వహించాలని, ధృవ పత్రాలు జారీ ప్రధాన అంశంగా చేపట్టడం జరుగుతోందన్నారు. శిబిరాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు జగనన్న కు చెబుదాం కార్యక్రమం కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో శిబిరాల వివరాల షెడ్యూలు ముందుగా తెలియజేయాలని సూచించారు. ఈనెల 24నుంచి వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలియజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించి కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని ఆమె చెప్పారు. కుల, ఆదాయ, జనన, మరణ, కుటుంబ సభ్యుల, వివాహ ధృవపత్రాలు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, కుటుంబ సభ్యుల విభజన, మ్యుటేషన్, ఫోన్ - ఆధార్ అనుసంధానం, పంట సేద్యం హక్కు కార్డులకు ఎక్కువ అర్జీలు వచ్చే అవకాశం ఉందని ఆమె సూచించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి నిశితంగా ప్రణాళికలు రూపొందించాలని ఆమె చెప్పారు. ఆర్జీల పరిష్కారంపై ఆర్జీదారుకు విధిగా తెలియజేయాలని ఆమె సూచించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంపై ఇప్పటికే మండల స్థాయి శిక్షణ పూర్తయ్యిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం పక్కాగా ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, బృందాలు నియమించామని అన్నారు. స్థానికంగా పరిష్కరించే సమస్యలు తక్షణం పరిష్కరించుటకు చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, డ్వామా పీడీ కె. రామచంద్ర రావు, మునిసిపల్ కమిషనర్లు జె.రామ అప్పల నాయుడు, హెచ్. శంకర రావు, ఎస్. సర్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రికవరీపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కొమరాడ

వైఎస్సార్ క్రాంతి పథంలో రికవరీపై సిబ్బంది దృష్టి సారించాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చిన శ్రీనిధి రుణాలకు సంబంధించిన రికవరీలపై ఆరా తీశారు. మండలంలో లక్ష్యాలు మేరకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని అలాగే రికవరీలు కూడా సక్రమంగా ప్రతి నెలా చేయాలని స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు అభివృద్ధి చెందేదుకు ప్రభుత్వం అన్ని విధాలా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తూ రుణాలు మంజూరు చేసిందని తెలిపారు. రుణాల ద్వారా స్వయం ఉపాధి పొందిన కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు శ్రీనిధి ఉన్నతి రుణాలు దోహదపడతాయన్నారు. రుణాలు మంజూరు చేయడంతో పాటు గ్రౌండ్ చేసిన తర్వాత సక్రమంగా యూనిట్లను మహిళలు సద్వినియోగం చేసుకొనేలా వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అలాగే మండలంలో ఉన్న అన్ని డ్వాక్రా సంఘాల గ్రూపులు ఏ గ్రేడ్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన అన్ని రుణాలకు సంబంధించి శతశాతం రికవరీ ఉండేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఇంచార్జ్ ఎపిఎం వెంకటరమణ, సిసిలు, మండల సమైక్య సభ్యులు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు సమస్యలను వివరిస్తున్న యుటిఎఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి మురళీమోహనరావు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఐటిడిఎ వద్ద బస

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన విద్యారంగం- గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఐటిడిఎ ముఖద్వారం వద్ద బుధవారం రాత్రి ఉపాధ్యాయులు బస చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలపై ఉపాధ్యాయుల నినాదాలతో ఐటిడిఎ దద్దరిల్లింది. అనంతరం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ పిజి హెచ్ఎంలను ఎస్ఎ కేడర్ ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భాషా వాలంటీర్ల నియమించాలన్నారు సిఆర్‌టిలందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పండిట్ పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలన్నారు అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని, బకాయి పడిన 10 నెలల మెస్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని, ఖాళీగా ఉన్న డిప్యూటీ డిఇఒ పోస్టులను సీనియార్టీ హెచ్ఎంఎల్ ద్వారా భర్తీ చేయాలని అన్నారు. జిపిఎస్ పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాష్, సవర భాష వాలంటీర్ సంఘం నాయకులు డుంబు తదితరులు పాల్గొన్నార.ు అనంతరం డిడి శ్రీనివాసరావు, ఎపిఒ రోషి రెడ్డి సూపరిండెంట్లు దేశ్ వెంకటేశ్వరరావు శిబిరం వద్దకు వచ్చి వినతి స్వీకరించారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టి తీసుకు వెళ్తామని చెప్పారు.

ముగ్గురు ఎస్ఐలకు బదిలీ

పజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో ముగ్గురు ఎస్ఐలకు బదిలీలయ్యాయి. పార్వతీపురం టౌన్ ఎస్ఐ విధులు నిర్వహిస్తున్న ఫకృద్దీన్‌కు పాచిపెంట ఎస్ఐగా బదిలీ అయ్యింది. డిసిఆర్‌బి ఎస్ఐగా పనిచేస్తున్న దినకర్‌కు పార్వతీపురం-1 ఎస్ఐగానూ, కొరియా ఎస్ఐ పి.నారాయణకు పార్వతీపురం-2 ఎస్ఐగా బదిలీ అయ్యింది.

రిజిస్ట్రేషన పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న పిఒ కల్పనాకుమారి

ఆర్ఒఎఫ్ఆర్ లబ్ధిదారులకు 150 పనిదినాలు

ప్రజాశక్తి - సీతంపేట

ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలున్న లబ్ధిదారులకు ఉపాధిహామీ ద్వారా 150 రోజులు పనిదినాలు కల్పించాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. బుధవారం మర్రిపాడులో ఆర్ఒఎఫ్ఆర్ పట్టా లబ్ధిదారులతో సమావేశయ్యారు. వీరికి అక్కడే 150 పనిదినాలు కల్పించేలా రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ అవకాశాన్ని ఆర్ఒఎఫ్ఆర్ పట్టా లబ్ధిదారులు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిడి శ్రీహరిరావు, ఎపిఒ, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1677 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

ఈ ఏడాది ఖరీఫ్‌నకు సంబంధించి మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 1677 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ తెలిపారు. అలాగే ఆర్‌బికెల వద్ద 405 మెట్రిక్ టన్నుల డిఎపి, యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సిసిఆర్‌సిపై ప్రతి గ్రామంలో ఈనెల 20న అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున కౌలు రైతులు, ఈ విషయం గమనించి గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలు రైతు కార్డు చేయించుకోవాలన్నారు. ఆ తర్వాత గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఇప్పటి వరకూ మండలంలో 227 కౌలు రైతు కార్డులను జారీ చేశామన్నారు. అలాగే పిఎంకిసాన్ ఇకెవైసి ఈనెలాఖరులోగా చేసుకోవాలని కోరారు. ఇంకా మండలంలో 1270 మంది రైతులు ఇకెవైసి చేయించుకోలేదన్నారు. అలాగే కంది విత్తనాలను గట్లపై వేసుకుని అధిక ఆదాయం పొందేలా మండలానికి 2500కేజీల కంది విత్తనాలను రైతు భరోసా కేంద్రాల నుంచి ఉచితంగానే అందిస్తున్నామని తెలిపారు.

పని పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లింపులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం పనులకు వెంటనే చెల్లింపులు జరుగుతున్నట్లు, పనులు వేగవంతం చేసినట్లు, పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతుందని జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావుతో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణదారులకు రావాల్సిన బకాయిలు మొత్తం చెల్లించడం జరిగిందని, ఇకపై కూడా పనులు పూర్తయిన వెంటనే సకాలంలో చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 313 గ్రామ సచివాలయాలు, 302 రైతుభరోసా కేంద్రాలు, 196 వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు మొదలు పెట్టడం జరిగిందని, వాటిలో 122 గ్రామ సచివాలయాలు, 84రైతు భరోసా కేంద్రాలు, 22 వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలు నిర్మాణం పూర్తిచేయడం జరిగిందని, మిగిలిన వాటిలో 75శాతం పూర్తయిన భవనాలు సెప్టెంబరు నాటికి, మిగిలిన భవనాలు డిశెంబరు నాటికి పూర్తిచేయడం జరుగుతుందని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గత మూడు నెలలలో ప్రజలకు అవసరమైన రెండుకోట్ల యాబది లక్షలరూపాయలు విలువ చేసే రోడ్లు, బోరువెల్స్, కుళాయిలు తదితర పనులు ప్రతిపాదించి, నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. డ్వామా పీడీ మాట్లాడుతూ నరేగా ద్వారా గత రెండేళ్లలో పూర్తిచేసిన, ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించిన బిల్లులకు రూ.62కోట్లు గతరెండు నెలలో చెల్లించామని చెప్పారు. పనులకు సంబంధించిన బిల్లులు అప్లోడ్ చేసిన వెంటనే చెల్లింపులు చేస్తామనానరు. పనులు చేపట్టి బిల్లులు అందజేసిన వారం రోజుల్లో పేమెంట్స్ జరుగుతున్నాయని, కావున మిగిలిన పనులకు కూడా వెంటనే చేపట్టి పూర్తిచేస్తామని తెలిపారు.

బ్యాంకింగ్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

బ్యాంకింగ్‌పై అవగాహన అవసరమని లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్ మూర్తి అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్థిక చేరికపై మండల స్థాయి క్విజ్ బుధ వారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఆర్థిక కార్యకలాపాలను తెలుసుకోవాలని అన్నారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు మోసాలకు పాల్పడటం జరుగుతుందని, వీటిపై స్పష్టమైన అవగాహన ఉండాలని ఆయన అన్నారు. చిన్ననాటి నుంచే పొదుపుపై దృష్టి ఉండాలనిసూచించారు. క్విజ్ పోటీల్లో మండలంలోని 11 పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. స్థానిక కెపిఎం హైస్కూల్ బృందం మొదటి బహుమతిని గెలుచుకుంది. ఈనెల 28న నిర్వహించనున్న జిల్లా స్థాయి క్విజ్‌కు అర్హత సాధించింది. విజేతలకు లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్ మూర్తి, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ రవిశంకర్ ప్రసాద్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

భామిని : స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఎపిజివిబి మేనేజర్ ఎన్.సతీష్ ఆధ్వర్యంలో ఆర్‌బిఐ మండల స్థాయి అఖిల భారత స్కూల్ క్విజ్ నిర్వహించారు. ఈ పరీక్షలో మొదటి స్థానం నిలిచిన భామిని హై స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలుకు హాజరు కావాల్సి ఉంది. ప్రస్తుతం జరిగిన పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థుల ఖాతాలో రూ.250 జమ అవుతాయి. ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ భాస్కరరావు, ఫీల్డ్ ఆఫీసర్ పృథ్వీ, హెచ్ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు నిమ్మల మోహనరావు, కలిశెట్టి విజయ్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యాన విద్యార్థులకు ఆర్థిక చేరికపై మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ వి.వి.ఆర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక కార్యకలాపాలు విద్యార్థులకు అవగాహన కల్పించారు.లీ పోటీల్లో నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ పాత్రుడు, ఉపాధ్యాయులు కల్లూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న పిఒ కల్పనాకుమారి

జగనన్న లే అవుట్ల పరిశీలన

ప్రజాశక్తి - భామిని

మండలంలోని కొరమ, ఘనసర జగనన్న లేఅవుట్లను బుధవారం సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి పరిశీలించారు. ఘనసరా లే అవుట్లలో ఇళ్ల స్థలాలు ఉన్న లబ్ధిదారులు త్వరితంగా ఇళ్లు నిర్మించాలని సూచించారు. కొరమ లేఔట్లో ఇళ్లు నిర్మించిన అన్ని లబ్ధిదారులు తమకు బిల్లులు చెల్లించలేదని తెలిపారు. బిల్లులు చెల్లిదేలా చూస్తామని పిఒ తెలిపారు. కార్యక్రమం కొరమ సర్పంచ్ ఆగుతమడి రఘుపతి నాయుడు, ఘనసరా సర్పంచ్ ప్రతినిధి కిల్లారి ఫల్గుణరావు, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

జాబ్ మేళాకు 35 మంది ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్ అండ్ టి కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక ఐటిఐలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 35 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ సునీల్ కుమార్ తెలిపారు. ఈ జాబ్ మేళాకు వివిధ ప్రాంతాల నుండి 75 మంది నిరుద్యోగ యువత వచ్చారని, అందులో 35 మందిని ఎల్ అండ్ టి కంపెనీ వారు ఎంపిక చేశారని ఆయన తెలిపారు. ఎంపికైన వారికి త్వరలో ఉద్యోగ పత్రాలను పంపిస్తారని శిక్షణ పంపిస్తారని ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో సిబ్బంది, ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పునఃప్రారంభం పాఠశాలలో చేరనివారిని సవర తేజ, సవర జ్యోతి విద్యార్థులు డ్రాపౌట్లుగా మారితే సమర్థిలే పాఠశాలలో చేర్పించామని తెలిపారు. అలాగే ప్రతి గురువారం మధ్యాహ్నం హెచ్ఎంలతో పిఒ సమావేశం నిర్వహించారు. నాడు నేడు, జగనన్న విద్యా కానుక పంపిణీ దానిపై సమావేశం ఉంటుందని తెలిపారు. ఈనెల 28న అమ్మఒడి పంపిణీపై విద్యార్థులకు అర్హత జాబితా పరిశీలిస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం స్పైడ్ కార్యక్రమం హెల్త్ సిబ్బంది నిర్వహిస్తారని తెలిపారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20నుంచి జూలై 4వరకు సిపిఎం చేపడుతున్న మహాపాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు కోరారు. బుధవారం స్థానిక సిపిఎం నాయకులతో కలిసి మహాపాదయాత్ర గోడపత్రికలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013భూసేకరణ చట్టం ప్రకారం పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు దమయంతి, న్యాయ, వెంకట్రావు పాల్గొన్నారు.

పిహెచ్సిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలి పిహెచ్సి వైద్య కేంద్రంలో బుధవారం భామిని పిహెచ్సి వైద్యుల ఆధ్వర్యంలో 12మంది మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స నిర్వహించామని స్థానిక వైద్యులు కొండపల్లి రవీంద్ర తెలిపారు. అలాగే బత్తిలి పిహెచ్సి పరిధిలోని వివిధ స్థానిక ఆశా కార్యకర్తలు సాయంతో ఎఎన్ఎంలు ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది మహిళలకు కౌన్సిలింగ్ నిర్వహించి, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సపై అవగాహన కలిగించామని తెలిపారు. కార్యక్రమం స్థానిక వైద్యులు దామోదరరావు ఉన్నారు.



కొత్తగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘసభ్యులు

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. సంఘం నూతన అధ్యక్షుడిగా మండవిల్లి సాంబశివరావు, కార్యదర్శిగా రాపాక నాగసాయి, కోశాధికారిగా 28వ వార్డు కౌన్సిలర్ బలబద్రుని శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. పట్టణ ఆర్యవైశ్య సంఘాన్ని గత 25సంవత్సరాలుగా తన గుప్పిట్లో పెట్టుకొని ఇష్టారాజ్యంగా ఆధిపత్యం చెలాయించిన మాజీ అధ్యక్షులు గంటా వెంకటరాజు ఈసారి పోటీ నుంచి తప్పుకున్నారు. సంఘం నిధుల దుర్వినియోగంతో పాటు అనేక అవకతవకలకు పాల్పడిన గంటా వెంకటరాజుపై సంఘసభ్యులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. నూతన అధ్యక్షులు మండవిల్లి సాంబశివరావు, కార్యదర్శి రాపాక నాగసాయి, కోశాధికారి బలబద్రుని శ్రీనివాసరావును వైసిపి జిల్లా కార్యదర్శి జర్జాపు సూరిబాబు, మున్సిపల్ జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె.వెంకటరావు అభినందించారు.

నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్

పజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నర్సిపురంలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి జి ప్రదీప్ కుమార్ వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నయోమి, టెక్నీషియన్ మాణిక్య కిరణ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు 104 సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - సాలూరు

ఖరీఫ్ సీజన్లో వరి పంట కంటే చిరుధాన్యాలు, గులిరాగి సాగుతో అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ ఎడి మధుసూదనరావు చెప్పారు. బుధవారం పట్టణంలోని ఆర్బికె పరిధిలో రైతులతో ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగుపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సాధికార సంస్థ ఎస్ ఆర్పీ దేవుళ్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖ రాజు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఎడి మధుసూదనరావు మాట్లాడారు. ఈ ఏడాది సీజన్లో 1375 మంది రైతులతో 1100 ఎకరాల్లో చిరుధాన్యాలు గులిరాగి సాగు చేయాలని లక్ష్యంగా చేసుకున్నట్లు ఎడి చెప్పారు. ఎకరాకు 20క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. పాచిపెంట మండలంలోని కేసలికి చెందిన మీసాల మోహన్‌రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఎస్ఆర్పీ దేవుళ్లు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు ఎఒలు పాల్గొన్నారు.

జోరుగా పత్తి నాట్లు

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి పత్తి పంటకు మంచి అదును దొరికిందని, దీంతో రైతులు ముమ్మరంగా పత్తి నాటుతున్నారని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కోటికిపెంట, కేసలి, మాతుమూరు గ్రామాల్లో పత్తి విత్తనాల సాగును పరిశీలిస్తూ రైతులంతా బిటి పత్తి రకాలను మాత్రమే వాడాలని, గడ్డి పిక్కల పత్తిని సాగు చేయకూడదని తెలిపారు. అలాగే గడ్డిపిక్కల పత్తి అమ్మకాలు, సాగుపై నిషేధం ఉందని అన్నారు. పత్తిలో అంతర పంటలుగా అపరాలు, చిరుధాన్యాలు, ఉల్లి నాటుకున్నట్లయితే అదనపు ఆదాయం రావడమే కాకుండా కలుపు నివారణ జరిగి భూమిలో సేంద్రీయ పదార్థం పెరుగుతుందని తెలిపారు. పత్తి పంట చుట్టూ ఆముదం, మధ్యలో నేలచిక్కుడు పంటలు సాగు చేయాలన్నారు.

మానసిక ప్రశాంతతకు యోగా అవసరం : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మానసిక ప్రశాంతతకు, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం పడుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు, లయన్స్ క్లబ్, యోగా శిక్షణా కేంద్రాల సౌజన్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని జెసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో ప్రతీ రంగంలో తీవ్ర పోటీ నెలకొందని, దానితో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. శారీరక శ్రమ తగ్గడంతో చిన్న వయస్సులోనే ఉబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. దీని ప్రాధాన్యత గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు యోగాను ఈరోజు అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు.విద్యార్థులు చదువుల్లో, పోటీ పరీక్షల్లో ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కావున మానసిక ఒత్తిడి నుంచి బయట పడేందుకు ఆటలు, యోగా సాధన చేయించాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బోను గౌరీశ్వరి మాట్లాడుతూ వయస్సుతో సంబంధంలేకుండా ప్రతి ఒక్కరు యోగా సాధన చేయాలని తెలిపారు. దిశా డిఎస్పి హర్షిత మాట్లాడుతూ టెక్నాలజీ, ఆధునిక సాధనాలు మూలంగా శారీరక శ్రమ తగ్గిపోయిందని, ప్రతి ఒక్కరూ రోజు కనీసం 20 నిముషాలు శారీరక వ్యాయామం చేయాలని తద్వారా మానసిక, శారీరక సమతౌల్యత కలుగుతుందని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాధరావు మాట్లాడుతూ యోగా సాధనతో ఆరోగ్యం పొందవచ్చుని, యోగా సాధనతో ఊబకాయం, డయాబీటిస్, రక్తపోటు వ్యాదుల నుండి రక్షణ పొందవచ్చునని తెలిపారు. సూర్య యోగా కేంద్రం వారిచే యోగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డిపిఆర్ఒ ఎల్.రమేష్, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ టి.హేమాక్షి,

కురుపాం : యోగా చేస్తున్న ఫస్ట్‌క్లాజ్ మెజిస్ట్రేట్ రోహిణీరావు

హెూమియో డాక్టర్ బి.సుశీల, లయన్స్ క్లబ్ చైర్మన్ రాజేశ్వరరావు, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, యూనియన్ బ్యాంకు మేనేజర్లు రామకష్ణ, అనన్ గుప్తా, ఓం శాంతి ప్రతినిధి పి.కె.జ్ఞానరత్నం, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్.సోంబోర మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు యోగాపై కూడా దష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : అంతర్జాతీయ యోగా దినోత్సవం సీతంపేట వైటీసీలో ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత, చురుకుదనం అలవాటుపడి రోజంతా ఉల్లాసంగా ఉండడానికి దోహదం చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ నరసింహమూర్తి, గురుకులం సెల్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, ఎఎంఒ కోటిబాబు, స్పోర్ట్స్ ఇంచార్జ జాకబ్ దాయానందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మానసిక ఉల్లాసానికి శారీరక దారుఢ్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.రోహిణీరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జ్యుడీషియల్ కోర్టులో యోగాను నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది బరాటం చంద్రమౌళి , పారా లీగల్ వాలంటీర్లు అంధవరపు కోటేశ్వరరావు , గోటారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల పరిధిలోని రావుపల్లి, గరుగుబిల్లి,గొట్టివలస, కొంకడివరం,తదితర గ్రామాల్లో అంతర్జాతీయ యోగా వేడుకలను ఉపాధి హామీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రావుపల్లి, గొట్టివలస సర్పంచులు బొంతాడ మహేశ్వరరావు (మహేష్) బోనుచంద్రినాయుడు యోగా ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి లెంక గోపాలరావు, టెక్నికల్ అసిస్టెంట్ చింతల రుద్ర కోటేశ్వరరావు, కొట్నాన నిర్మల, మర్రాపు భూలక్ష్మి, కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు నల్ల సూర్యనారాయణ, ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్‌పేట మైక్రో వాటర్ షెడ్ పరిధిలో ఎస్‌కె పాడు అమృతసరోవర్ వద్ద యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి, ప్రజా ప్రతినిధులు, సచివాలయం ఉద్యోగులు, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉపాధి హామీ చట్టం కింద కేటాయించిన అమృత సరోవరం చెరువుల వద్ద క్షేత్ర, సాంకేతిక సహాయకుల ఆధ్వర్యంలో యోగ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని పులిగుమ్మి చెరువు గట్టు పైన ఎపిఒ నాగలక్ష్మి ఆధ్వర్యంలో వేతనదారులు, మెట్లు గ్రామస్తులతో కలిసి యోగాసనాలు వేశారు. అలాగే

యోగాలో చేస్తున్న జెసి గోవిందరావు, అధికారులు

మండలంలోని ఎమ్మార్ నగరం, ఎల్ఎన్ పురం, అడ్డాపుసిల, జమ్మిడివలస, సంఘంవలసలో అమృత సరోవర్ చెరువుల ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మండలంలోని సూడిగాం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వంగపండు వసంతనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులచే యోగాసనాలు వేయించి యోగా దినోత్సవం జరిపారు.

సాలూరు: యోగాసనాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గుమడాం వైటిసిలో గర్భిణీ స్త్రీల హాస్టల్ లో యోగా దినోత్సవం నిర్వహించారు.

భామిని: మండలంలోని బిల్లుమడ ఎంపిపి పాఠశాలలో జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బత్తిలి పిహెచ సి వైద్యులు కొండపల్లి రవి ఆధ్వర్యంలో పిల్లలచే యోగా చేయించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 భాస్కరరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో యోగాపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యాన యోగా నిర్వహించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.రేణుక ఆధ్వర్యంలో యోగ దినోత్సవం జరిపారు ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - కురుపాం

యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. ఆర్‌వి కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నీలో గత 20 రోజులుగా 30 క్రికెట్ టీమ్‌లు పాల్గొన్నారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో విన్నర్‌గా నిలిచిన కురుపాం శరత్ టీం రూ.20 వేలు నగదు, షీల్డ్‌ను, రన్నర్‌గా నిలిచిన ఆర్‌వి కింగ్స్ టీంకు రూ.10వేల నగదు, షీల్డ్‌ను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత క్రీడల్లో ఏవిధంగా రాణిస్తున్నారో, విద్యలోనూ అలాగే రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు,

కురుపాం : ట్రోఫీ అందుకుంటున్న శరత్‌టీం సభ్యులు

మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైసిపి నాయకులు రాయిపల్లి శ్రీధర్, ఆర్.శ్రీను, ఎస్.చంటి టోర్నీ నిర్వాహకులు ఆర్‌వి కింగ్స్ యూత్ పాల్గొన్నారు.

పాచిపెంట : నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పెదకంచూరులో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో శతబి జట్టు విన్నర్ కాగా, కేరంగి జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈపోటీల్లో 22 టీములు సుమారు 200 పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు నీడ్ డైరెక్ట్ పి.వేణుగోపాలరావు బహుమతులను అందజేశారు. అలాగే బెస్ట్ ప్లేయర్‌కు,మరో 8మంది క్రీడాకారులకు గోల్డ్ మెడల్ అందజేశారు. మిగతా క్రీడాకారులు కూడా క్రికెట్ బ్యాట్లను ఇచ్చారు. కార్యక్రమంలో నీడ్ సిబ్బంది మహేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రాథమిక దశలో చిన్నారులకు చక్కని విద్యతో పాటు పౌష్టికాహారం సక్రమంగా అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో గిరిజన ప్రాంత పరిధిలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టుల వారీగా అమలు చేస్తున్న పథకాలు, లబ్ధిదారుల వివరాలను సమీక్షించారు. గర్భిణీలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అభియాన్ ద్వారా అందిస్తున్న పాలు, పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలో బరువు తక్కువ ఉన్న చిన్నారులు, రక్తహీనత కలిగిన గర్భిణీలు, బాలింతల వివరాలను నమోదు చేయాలని, వారికి పౌష్టికాహారం, మందులు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, ప్రాజెక్ట్ అధికార్లు పాల్గొన్నారు.

రెండో ఎంఇఒ జనార్దన్‌నాయుడు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల రెండో ఎంఇఒగా బడే జనార్దన్ నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈయన జియ్యమ్మవలస మండలం బిజెపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ప్రభుత్వం ప్రతి మండలానికి రెండో విద్యాశాఖ అధికారుల నియామకాల్లో భాగంగా ఈయనను రెండో విద్యాశాఖ అధికారిగా ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ గుమ్మలక్ష్మీ పురం మండలానికి కేటాయించినట్లు చెప్పారు.

టాపర్స్‌ను అభినందించిన పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి బుధవారం అభినందించారు. దోనుబాయి ఆశ్రమ పాఠశాలను చెందిన పాలక గురునాథ్‌కు ఎస్టీ కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్ రావడంతో సీఎం చేతుల మీదుగా రూ.75వేలు చెక్కును అందజేశారు. అలాగే సామరెల్లి పాఠశాలకు చెందిన సవర నందినికి రాష్ట్ర స్థాయిలో తృతీయ ర్యాంక్ రావడంతో రూ.50వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలానే బాగా చదవాలని సూచించారు. చదువే అన్ని సమస్యలకు మార్గం చూపుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి ఎం శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, సూపరింటెండెంట్ దేశ్, హెచ్ఎం సుబ్బారావు పాల్గొన్నారు.

రాష్ట్రపతి కలిసిన బృందంతో పిఒ సమీక్ష

ఇటీవల రాష్ట్రపతిని కలిసిన గిరిజన బృందంతో ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతిని కలవడంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీలో ప్రముఖ ప్రాంతాలను, ముఖ్య భవనాలను చూపించారని వారు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రపతిని కలవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. గిరిజన సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా అని రాష్ట్రపతి అడిగారని వారు తెలిపారు.

వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రజారోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజల ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది జాగ్రత్తగా ఉంటూ వైద్య సేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహన్రావు అన్నారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిని ఆయన సందర్శించారు. తొలుత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా అక్కడ వైద్య సిబ్బంది నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పిహెచ్‌సిలో వైద్య సిబ్బందితో పలు ఆరోగ్య కార్యక్రమాల నివేదికలపై ఆరా తీశారు. గర్భిణుల నమోదు, ఆయిష్మాన్ భారత్ హెల్త్ ఐడి మ్యాపింగ్, హై రిస్క్ గర్భిణులను గుర్తించడం, వాటి పర్యవేక్షణ, గర్భిణులకు టిడి టీకా రెండు డోసులు, ఐరన్ మాత్రల పంపిణీ, వాటి వివరాలు, ఈ-ఆశా అప్లికేషన్‌లో హెచ్‌బివైసి, హెచ్‌బిఎన్‌సి ఆరోగ్య వివరాల నమోదు చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు మాతా,శిశు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. అరుణ్ కుమార్ నాయుడు, ప్రిన్సిపల్ జి.లక్ష్మి, సూపర్ వైజర్లు సత్యనారాయణ, విజయ కుమారి, చాయమ్మ, జయ గౌడ్, వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు యువజనోత్సవాలు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

జిల్లాలో యువజనోత్సవాలను గురువారం నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యువతలో ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర, ఎస్.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ఎస్‌వి ప్రభుత్వం డిగ్రీ కాలేజీలో జరుగు ఉత్సవాల్లో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫోటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక, జానపద కళలు వంటి అంశాలపై యువ ఉత్సవ్ నిర్వహించనున్నామనితెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన 15 నుండి 29 ఏళ్ల ఔత్సాహికులు వారి వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుని పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. పార్వతీపురం మన్యం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో లేక 7386325310 ఫోన్ కు సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్‌కు ఫోన్ చేయగలరు.
పార్వతీపురం జిల్లా సర్క్యులేషన్ ఎగ్జిక్యూటివ్
యస్. నాగేశ్వరరావు : 94900 99319

దళితులపై ఆగని దాడులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వైసిపి అధికారం ముగింపు దశకు చేరుకున్నప్పటికీ రాష్ట్రంలో దళితులపై దాడులు ఆగడం లేదని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా గాజులపల్లె రైల్వే లైన్‌పై గోపవరం వద్ద రైలు కిందపడి చినబాబు అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, మృతుడు ఆత్మహత్యకు ముందు తీసిన సెల్ఫీ వీడియో ప్రకారం సంబంధం లేని ఓ ద్విచక్ర వాహనం చోరీ కేసులో తనను ముద్దాయిగా చేశారని అన్నారు. నంద్యాల ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ నాగన్న, ఏసుదాసు కానిస్టేబుళ్ల వేధించారని సెల్ఫీలో తెలిపారన్నారు. పోలీసుల వైఖరితో మనస్తాపానికి గురై రైలు కిందపడుతున్నట్లు తెలిపాడని, గతంలోనూ ఇదే పోలీస్ స్టేషన్లో వేధింపులు భరించలేక ముస్లిం కుటుంబానికి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. జగన్మోహన్ రెడ్డి తన నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో దళితులపై ఎన్నడూ లేని దాడులు, అత్యాచారాలు జరిగాయని ఈ విషయాన్ని తమ ప్రభుత్వం మానవ హక్కుల సంఘానికి నివేదించడమే కాకుండా దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని అన్నారు.

కొటియాలో జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియాలో ఒడిశా ప్రభుత్వం జగన్నాథ స్వామి రథయాత్రను బుధవారం పొట్టంగి ఎమ్మెల్యే ప్రీతం పాడి, మాజీ ఎమ్మెల్యే ప్రపుల్ల కుమార్ పాంగి ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా కొటియాలో జగన్నాథస్వామి రథయాత్ర సంబరాలను ఒడిశా ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తూ వస్తోంది. ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల మధ్య కొటియా గ్రామాల వివాదం ముదురుతున్న కొద్దీ స్థానిక ప్రజలను ఆకర్షించడానికి ఒడిశాలోని కొరాపుట్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే కొటియాలో జగన్నాథ స్వామి రథయాత్ర సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు.

రోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైద్యసేవలకు వచ్చే రోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. బుధవారం స్థానిక సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య, రోగులకు ఎదురవుతున్న సమస్యలు, సౌకర్యాలు, మందుల నిల్వ వంటి అంశాలపై చర్చించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత వైద్యాధికారులను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్ ఖాన్ కోరారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందేలా చూడాలని సూచించారు.

మహారాజశ్రీ పార్వతీపురం
సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P. 2/2023

Between:
ముంజేటి పార్థరావు S/o లేటు జగన్నాథం, వయస్సు 39 సంవత్సరములు, శివ్వాలవీధి, కురుపాం గ్రామం మరియు మండలం, పార్వతీపురం మన్యం జిల్లా ....పిటిషనర్
And:
చల్లెల గిరి వగైరాలు .....రెస్పాండెంట్స్

1. చల్లెల గిరి	2. దన్నాల రవీంద్ర
3. ఆకుల గంగరాజు	4. కవిరిపల్లి ప్రదీప్
5. గుంట్రెడ్డి పోలినాయుడు	6. గురుగుబిల్లి పుష్పమ్మ
7. తెంటు శ్రావణ్	8. చందక చిన్నమ్మి
9. కలివరపు గౌరిశంకర్	10. అందవరపు సురేష్
11. గొల్లపల్లి వైకుంఠ	12. కశింకోట రాము వగైరాలు

ఇందుమూలంగా పైన తెలిపిన ప్రతివాదులకు తెలియజేయునది ఏమనగా పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం గ్రామం మరియు మండలం, శివ్వాలవీధి కాపురస్తులు అయిన ముంజేటి పార్థరావు లేటు S/o లేటు జగన్నాథం పైన తెలిపిన ప్రతివాదుల వద్ద నుండి అప్పు తీసుకొని తీర్చుటకు శక్తి లేని వాడినని తీర్పు చేయమని మరియు పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణ కల్పించమని శ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో I.P.3/2023 పిటిషన్ దాఖలు చేసియున్నాను. కావున పైన తెలిపిన ప్రతివాదులకు ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల స్వయంగా గాని, వకీల్ ద్వారాగాని **తే 26-06-2023దిన ఉదయం 10-30గంటల**కు పైన తెలిపిన కోర్టులో హాజరు కావాలని లేని పక్షములో శ్రీ కోర్టువారు మీ పరోక్షముగా తీర్మానించబడునని ఈ ప్రతివాదులకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.

పెంకి కృష్ణారావు
పిటిషనర్ తరుపు న్యాయవాది,
బొబ్బిలి, సెల్ : 9440335940

సిఎం సభ విజయవంతానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - బలిజిపేట

ఈనెల 28న కురుపాంలో జరగబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమావేశాన్ని విజయవంతం చేయడానికి మండలం నుంచి తగు ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో చేయాలని డిఆర్‌డిఎ పిడి పెద్దింటి కిరణ్ కుమార్ వెలుగు అధికారులకు తెలిపారు. బుధవారం వెలుగు కార్యాలయంలో మండల స్థాయిలో గ్రామ విఒఎలతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి బస్సు ఏర్పాటు చేస్తున్నామని, మహిళా సంఘాల సభ్యులు బయలుదేరేలా విఒఎలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎపిఎం ఉమామహేశ్వరావు, మండల సమైక్య సభ్యులు కాగాన మేరీ, సిసిలు మురళి, దాసు, గురుమూర్తి, గ్రామైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: కురుపాంలో ఈనెల 28న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రామ్ను విజయవంతం చేయాలని డిఆర్‌డిఎ ఎపిడి వై.సత్యంనాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక వైకెపి కార్యాలయంలో బుధవారం మండల గ్రామైక్య సంఘాలతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. మండలం నుంచి దాదాపు 8,000 మంది మహిళా సంఘాల సభ్యులు సిఎం సభకు హాజరయ్యేలా గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, సిసిలు చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో ఎపిఎం పి.అప్పలనాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు గంట లక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

నేరాలు ఘోరాలు

మృతి చెందిన భాస్కరరావు

యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీ పనసమానుగూడ సమీపానున్న కొండపై గుమ్మలక్ష్మీపురం మండలం, డుమ్మంగి పంచాయతీ, బాసంగికి చెందిన మండంగి భాస్కరరావు (32) ను పెట్రోల్ పోసి హత్యకు గురయ్యారు. నీలకంఠపురం పోలీసులు అందించిన వివరాలు ప్రకారం కురుపాం మండలం, మొండెంఖల్ పంచాయతీ, ఇచ్చాపురం గ్రామానికి చెందిన పాలక బుద్దేశ్వరరావు అనుమానితుడిగా భావిస్తూ ఆయన హత్యకు సహకరించిన మరో ఇద్దరిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టల పోలీసులు తెలిపారు.